# ఛందస్సుకు అందని కవిత

– తమిళ మూలం : జయకాంతన్

తెలుగు : డా. దేవరాజు మహారాజు

కళలకు ఏ మాత్రమూ సంబంధం లేని ఒక బిజినెస్ ఆర్గనైజేషన్‌లో రామనాథన్ నెలకు నూటాయాభై రూపాయల జీతం మీద పనిచేస్తున్నాడు. లాడ్జిలో ఉంటాడు. కవితలు రాస్తాడు. బాగా చదువుకున్న వాడు. ఎప్పుడూ ఏదో చదువుతూ ఉంటాడు. అందువల్ల అందరూ అతణ్ణి గౌరవిస్తూ ఉంటారు. ఆ గౌరవం వల్ల అతనికి ఏ ప్రయోజనమూ లేదు. అది వేరే విషయం ! కాని మరికొంత మంది దృష్టిలో ఇతడు ఉట్టి సోమరి పోతు. వయస్సు సుమారు ముప్పయి అయిదు. తల్లి దండ్రులు ఎన్ని సార్లు పెండ్లి ప్రస్తావన తెచ్చినా, ఏదో ఒక విధంగా దాటవేస్తూ ఉంటాడు. 'కొడుకు సన్యాసి అయ్యాడే' - అని వాళ్ళు ఒక వైపు బాధపడుతూ ఉంటే, మరో వైపు స్నేహిత బృందం ఇతణ్ణి 'ఉమెన్ కిల్లర్' గా గుర్తించింది. ఒకరోజు రామనాథన్, ఒక అమ్మాయిని తను వుండే లాడ్జి గదికి తీసుకొచ్చాడు.

లాడ్జిలో వుండే మరో వ్యక్తి కృష్ణ అయ్యర్. అతడు ఉదయమే వ్యాయామం చేస్తాడు. శరీర పోషణ గురించి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాడు. రామనాథన్ వెంట అమ్మాయి గదిలోకి వెళ్ళడం కృష్ణ అయ్యర్ కళ్ళారా చూశాడు. డాబా మీద వ్యాయామం చేసే వాడల్లా కిందికి దిగి తన గదిలోకి మిగతా వారి నందరినీ లేపి, విషయం చెప్పాడు - అంతే !! విషయం పెట్రోలు మంటలా చుట్టు ప్రక్కలంతా అంటుకుంది.

ఆ రోజు రామనాథన్ ఆఫీసు నుండి రాగానే లాడ్జిలోని ఇతర గదుల్లోని వాళ్ళంతా కలిసి, అతని గదికి వచ్చారు. లాడ్జిలో ఉన్న వాళ్ళంతా రేడియో వినడానికో, పుస్తకాలు అడుక్కోవడానికో అతని గదికి ఎప్పుడూ వస్తూనే ఉంటారు. కాని అందరూ కలిసి ఒకేసారి రావడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. "ఏమిటి విశేషం ? -" అని అడిగాడు. తీరా చూస్తే గది నిండి పోయి బయట కూడా కొంత మంది నిలబడి ఉన్నారు. వచ్చిన వాళ్ళు ఆ ఉదయం కనిపించిన అమ్మాయి గురించి విచారణ జరపడం ప్రారంభించారు. ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా మాట్లాడి గలాటా చేశారు. రామనాథం ఏమీ మాట్లాడలేదు. బట్టలుమార్చుకుని, కుర్చీలో కూర్చుని చిరునవ్వుతో అందరి ముఖాలు ఒకసారి చూశాడు.

ఆమె ఉత్తర భారతదేశపు స్త్రీ. కుటుంబంతో ఊరు చూడడానికి వచ్చింది. ట్రావెలర్స్ బంగళాలో బస చేశారు. సినిమా థియేటర్లో కనిపించిన ఆమెను ఇక్కడికి తీసుకు రావడానికి రామనాథన్ ఎంతో శ్రమించాడు. విషయమంతా ఆసక్తికరంగా చెప్పుకొచ్చిన రామనాథన్, ఆ అమ్మాయి అందాన్ని గుణ గణాల్ని వర్ణించడం ప్రారంభించాడు. రామనాథన్ మీద తప్పు వేసి, విచారించి అతను తల కిందికి వేసుకునేట్లు చేసి అవమానిద్దామని వచ్చిన సహచరులంతా అతని మాటల్లో పడి అసలు విషయం మరిచి పొయ్యారు. ఏమీ చెప్పలేక "అయ్యా ! నువ్వేమైనా చెయ్యి, కాని లాడ్జి పేరు నవ్వుల పాలు చేసి మేం బయట తల దించుకొనేట్లు మాత్రం చెయ్యకు" - అని విన్నవించుకున్నారు. రామనాథన్ సిగరెట్ వెలిగించుకుని, విలాసంగా పొగ వదిలి, "నేను ఉంటున్నట్లే మీరు కూడా లాడ్జిలో అద్దెకు ఉంటున్న వారేకదా ? నాకు లేని బెంగ మీకు ఎందుకు? అయినా ఏదైనా చెప్పదలుచుకుంటే లాడ్జి మేనేజర్ నాతో చెప్తాడు కదా ?" - అని అన్నాడు.


వాళ్ళకేం మాట్లాడాలో తెలియలేదు. మేనేజర్ దగ్గర ఫిర్యాదు చేయడానికి వెళ్ళిపోయారు. దీని కంతటికీ కారణమైన కృష్ణ అయ్యర్ మాత్రం వాళ్ళతో పాటు వెళ్ళిపోలేదు. రామనాథన్‌ను పిచ్చివాణ్ణి చూసినట్టు చూస్తూ నిలబడ్డాడు. రామనాథన్ గడ్డం పట్టుకుని "పెండ్లి చేసుకోరా తండ్రీ" అని ఏడుస్తూ దీనంగా బ్రతిమిలాడుకునే అతని తల్లిని గుర్తుకు తెచ్చుకున్నాడు. ఆ ముసలి తల్లి కోరికను తిరస్కరించి, డబ్బును పాడుచేసుకుంటూ ఆరోగ్యాన్ని చెడగొట్టుకునే ఈ రామనాథన్ అనే వ్యక్తిని చూసేసరికి కృష్ణ అయ్యర్‌కు పట్టలేని ఆగ్రహం కలిగింది.

"ఏయ్ మిస్టర్ రామనాథన్ నిజంగానే యాభై రూపాయలు ఆ అమ్మాయికి ఇచ్చావా ?" - అని అడిగాడు కృష్ణ అయ్యర్. ఎంతో విలువైన యాభయి రూపాయల్ని కేవలం ఒకే ఒక రాత్రి సంబంధం కోసం ఖర్చు పెట్టినందువల్ల అతని మనసు బాధ పడింది. "మా ఊళ్ళో వున్న నా కుటుంబానికి యాభయి రూపాయలు పంపడానికి, హోటల్ భోజనం మానేసి, గదిలో స్టౌ మీద వంట చేసుకుని తినాల్సివస్తోంది. ఆ యాభయి రూపాయల విలువ నాలాంటి వాడికి తెలుస్తుంది. నీకేం తెలుస్తుంది ?" - అని మథన పడ్డాడు. "చెప్తున్నానని తప్పుగా భావించొద్దు. డబ్బు విలువ నీకు తెలియనిది కాదు. నువ్వు కూడా ఎన్నో సార్లు డబ్బుకు ఇబ్బంది పడి ఉంటావు. కష్టపడి సంపాదించిన డబ్బుని తగని పనులకు గుప్పించడం ఏం బాగా వుంటుంది ?" అని మెత్తగానే తీవ్ర స్వరంతో ప్రశ్నించాడు. అప్పుడు రామనాథన్ కుర్చీలోంచి లేచి, బుక్ షెల్ఫ్ వద్దకు వెళ్ళి ఒక పత్రిక వెతికి తీశాడు. అయ్యర్ వైపు తిరిగి "చూడు కృష్ణా ! నువ్వు నా కోణంలోంచి చూస్తే నా పని సరైనదే అని నువ్వే ఒప్పుకుంటావు"

"ఎవరి కోణంలోంచి చూసినా వ్యభిచారం వ్యభిచారమే !" - అని గట్టిగా నొక్కి పలికాడు కృష్ణ అయ్యర్. "నువ్వు స్త్రీ లోలుడిగా మారడం మంచిది కాదు. అంతే నాకు తెలుసు" అని చెప్పి నళ్యం

డబ్బీలోంచి చిటికెడు పొడుం తీసుకుని పీల్చి తల అటు తిప్పుకున్నాడు.

"నిలబడే మాట్లాడతా వేం ? కూర్చో -" అన్నాడు రామనాథన్ తన సిగరెట్ పొగ కృష్ణ అయ్యర్ పైకి పోకుండా కిటికీలోకి వదిలి - కృష్ణ అయ్యర్ మౌనంగా కూర్చున్నాడు. రామనాథన్ ఆలోచిస్తూ చివరి సారిగా సిగరెట్ పీల్చి, ఏష్ ట్రేలో సిగరెట్ పీక ఆర్పేసి, పొగ వదిలి గాలి పీల్చుకున్నాడు.



"నీకు ఏ వయసులో పెళ్ళయ్యింది ?" అని అడిగాడు

"ఇప్పుడు అదెందుకూ ?" కోపంతో ఉలిక్కిపడ్డాడు కృష్ణ అయ్యర్. "చెప్పండి సార్" - అని వినయంగా అడుగుతూ చేతిలోని పత్రిక టేబుల్ పై పెట్టి, షెల్ఫ్ లోంచి ఒక పెద్ద పుస్తకం వెతికి తీసుకున్నాడు. కృష్ణ అయ్యర్ అతని ముందు పెట్టిన పత్రికను అటూ ఇటూ తిరగేస్తూ "నాకు ఇరవై రెండో యేట పెళ్ళయ్యింది" - అన్నాడు. ఆ పత్రిక పేరు - శోధన. "పేరు కొత్తగా ఉందే" - అని చూసి పేజీలు తిప్పుతూ వుంటే దాంట్లో రామనాథన్ పేరుతో ప్రచురింపబడ్డ కవిత కనిపించింది. కృష్ణ అయ్యర్ చదివి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఇతను రాస్తాడు అని తెలుసుకొని ఏం రాస్తాడన్నది కృష్ణ అయ్యర్‌కు అప్పటి దాకా తెలియదు. 'ప్రేమాంకురం' అనే కవితా శీర్షిక చూసి మనసులోనే నవ్వుకున్నాడు కృష్ణ అయ్యర్. అప్పుడు రామనాథన్ అన్నాడు "అయితే నీకు ఇరవైరెండో యేట పెళ్ళయ్యిందా సార్ ? నాకు ఇప్పుడు ముప్పయి అయిదేళ్ళు - !"

అది విన్న కృష్ణ అయ్యర్‌కు తల తిరిగి పోయింది. కోపంతో - "ఏం మనిషి వయ్యా నువ్వూ ? పది రోజుల క్రితం కూడా నిన్ను పెండ్లికి ఒప్పించడానికి మీ తల్లి దండ్రులొచ్చి పొయ్యారు. నువ్వేమో ససేమిరా కాదన్నావు. నువ్వు లేని సమయంలో మీ అమ్మ వచ్చి నిన్ను పెండ్లికి ఒప్పించమని లాడ్జిలో అందరితో చెప్పిపోయింది. నువ్వేమో నాకు ముప్పయి అయిదేళ్ళు వచ్చాయి సార్. పెండ్లి కాలేదు సార్. గత్యంతరం లేక చెడిపోతున్నాను సార్ అని కారణాలు చెబుతావా ?" - అని నిలదీశాడు.

"కొంచెం ఓపికగా వినండి సార్. నేను చెప్పడం ముగించక ముందే మీరు ఆవేశంగా మాట్లాడితే నేనేం చేసేది " - అన్నాడు రామనాథన్. కృష్ణ అయ్యర్ కొంచెం తగ్గి, "సరే చెప్పు పెండ్లి వద్దని ఎందుకు అంటున్నావో" అని కోపం తగ్గించుకుని 'శోధన' పత్రిక తీసి తిరగేయడం ప్రారంభించాడు. రామనాథన్ చేతిలోని పెద్ద పుస్తకం ఎదురుగా టేబుల్ మీద పెట్టి, కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"నూటాయాభై రూపాయల జీతంతో పెళ్ళి చేసుకుని బతికే దాని కన్నా ఒక మంచి తాడు వెతుక్కుని, ఉరివేసుకుని చనిపోవడం మేలని నా నమ్మకం! ఈ హోటల్లో ఒక్కో గదిలో నలుగురేసి ఉన్నారు. అలా ఉండడం నా వల్ల కాదు. కనీసం ఇప్పుడు నేను ఉంటున్నట్లు విడిగా గది, రేడియో, పుస్తకాలు, ప్రయివసీ ఉండాలి. ఇప్పుడున్న ఈ వసతులన్నీ వదిలేసి, ఎక్కడో ఒక కిరాయి అద్దె కొంపలో నాతో ఇంకొకతెను కూడా చేర్చుకుని, పిల్లల్ని జల్లల్ని కని, రోగాలకు, దారిద్ర్యానికి సర్వస్వం బలి ఇస్తూ గడిపే జీవితం ఎందుకూ ? " అని ఒకింత జాలిగా ప్రశ్నించాడు రామనాథన్.

"అవును. తర తరాలుగా జనం సంసారాలు చేసేది అలాగే కదయ్యా ? అందులో వింతేముంది ? -" అని పత్రిక నుండి దృష్టి మరల్చకుండానే జవాబిచ్చాడు అయ్యర్.

"అదే, నేను అంటున్నది అటువంటి సంసారం నాకు అక్కరలేదు. పంది కుక్క కూడా పిల్లల్ని కని సంసారాలు సాగిస్తున్నాయి. మరి మనిషైన వాడు మనిషిగా బతకాలి కదా ? అటు మరొకరి బతుకును బలి తీసుకుని, ఇటునా బతుకును నరకం చేసుకునే పెళ్ళి అనే తంతుకు నా జీవితంలో స్థానం లేదు. తెలిసి కూడా ఉచ్చులో ఇరుక్కుని అవస్థ పడడం బుద్ధి మంతుల పని కాదు. ఏమంటావ్ అయ్యర్ ? ఇప్పుడు మన ప్రభుత్వం వారు కుటుంబ నియంత్రణ గూర్చి ప్రచారం చెయ్యాలంటాను. పిల్లలు పుట్టకుండా ఆడమగ సుఖం అనుభవించడం న్యాయమైతే, పెండ్లి లేకుండా ఆడా మగా సుఖం అనుభవించడంలో అన్యాయమే ముంది ? " - అన్నాడు.

"న్యాయం - అన్యాయం " - అని పదాల్ని సాగదీశాడు కృష్ణ అయ్యర్. "ఒక్క రాత్రి సుఖం కోసం వేశ్యకు యాభయి రూపాయిలు తగలేసే నువ్వు, ఆర్థిక సూత్రాల గురించి, ప్రభుత్వ ప్రచారం గూర్చి మాట్లాడతావా ? నీకు ఆ అర్హత ఉందా అసలు ?"

"అవును. ఇప్పుడు నేను చేసింది - ఖర్చు! కక్కుర్తి లేకుండా దొరబాబు లాగా ఖర్చు పెడుతున్నాను. దీని కోసం నా ఇతర ఖర్చులను తగ్గించుకోవడం లేదే. మేం మా కలయికలో సంతోషాన్ని మాత్రమే కలిసి అనుభవిస్తాం. కష్టాలూ కన్నీళ్ళూ ఎవరివి వారికే ఉంటాయి. బతుకును 'సులభం' చేసుకోవడంలో తప్పేముంది ?"

"పిచ్చివాడి లాగా మాట్లాడుతున్నావే ? ప్రేమ గురించి, అనురాగం గురించి నీకు ఏం తెలుసు ? కష్టాలు పంచుకుని, దారిద్ర్యంలో కూడా సంతోషంగా బతకగలగడంలోనే ఉంది, దాంపత్యం లోని అసలు సుఖం. జంతువుల్లాగా విచ్చలవిడిగా తిరిగేది మానవ జీవితమనుకుంటున్నావా ? ఇంతేనా నీకు తెలిసింది ? ఇదేనా నీ సిద్ధాంతం ?" కృష్ణ అయ్యర్ ఉడికి పోతూ మాట్లాడుతున్నాడు.

"అహః - ప్రేమ వర్ధిల్లాలని ఆ 'పదం' కోసం కష్టాల్ని అనుభవిస్తూ, బాధలు పడుతూ వుండడమే మీ సిద్ధాంతం! అవునా ?' ' మరో సిగరెట్ వెలిగించుకున్నాడు రామనాథన్.

"అది కాదు నేను చెప్పేది - మనిషి జీవితానికి ఒక పద్ధతి అనేది అవసరం! ఒక వ్యక్తిగా నిలబడగలిగే శక్తి కేవలం మానవుడికే ఉంది. ఆ శక్తే మానవ నాగరికతకు పునాది. దాన్ని నాశనం చేయాలనుకునేది - దుర్మార్గం! సమాజ ద్రోహం ".

వాదోపవాదాలు జరుగుతుండగా రామనాథన్‌కు మరికొన్ని విషయాలు తోచాయి. కృష్ణ అయ్యర్ కోపాన్ని ఎదుర్కోవడానికి అవి ఉపయోగపడ్డాయి.

"తన భార్య జ్ఞాపకార్థం తాజ్ మహల్ కట్టించిన వాడు ప్రేమ గురించి గొప్పగా మాట్లాడితే అర్థం ఉంది. ఒక చీరకు, ఒక ముక్కు పుల్లకు ఆడదాని కంట తడి పెట్టించే వాడు ప్రేమ గురించి మాట్లాడితే ఏం చెప్పాలి ? ఇదొక ఫ్యాషనయి పోయింది. తరతరాలుగా మనం పెంచిన నాగరికతే కదా వేశ్యలను కూడా ఉత్పత్తి చేసింది. ఈ జీవితాన్ని బాధించకు. ఐహిక వాంఛల కోసం తపించి పోవడం మనిషిగా పుట్టిన వాడి విధి. అని కూడా అన్నారు కదా ? ఈ విధి అనే నిప్పును తీసి ఈ సమాజపు కూకటి వ్రేళ్ళలో పెట్టండి. వ్యక్తిగతంగా ఒకడి నెత్తిలో పెడితే ఏమిటి సార్ లాభం ? పాపం! ఒకరికి ఒకరంట! జీవితాంతం ఒక దాని బాధ్యత నెత్తినేసుకుని, కుటుంబం సాఫీగా నడిపించడానికి మార్గమేదీ లేనప్పుడు మీలాంటి వాళ్ళు చెప్పే ధర్మం, న్యాయం ఏ రకంగానూ నిలబడవు. వాటిని రక్షించే వారే ఉండరు. హుః ఒకరికి ఒకరు, జంట, దాంపత్యం !!" అని హేళనగా అంటూ బిగ్గరగా నవ్వాడు. రామనాథన్ కాసేపటికి మళ్ళీ "నేను కాదు నాలాంటి మగవాళ్ళు చాలా మంది ఉన్నారు. వేశ్యలు కూడా చాలానే ఉన్నారు. ఖచ్చితంగా లెక్క గట్టారంటే మీ సిద్ధాంతం ప్రకారం ఒకడికి ఒకతే తేలుతుంది సార్" అంటూ అతి తెలివి ప్రదర్శించి మరింత బిగ్గరగా నవ్వాడు.

"అయ్యా! తమరు ఇంక ప్రేమ, సంసారం దాంపత్యం వంటి పదాలను ప్రయోగించొద్దండీ బాబూ - ఇక ఆపండి దయచేసి" కృష్ణ అయ్యర్ విసుక్కుని, సంభాషణను కొనసాగించడం ఇష్టం లేక 'శోధన' పత్రికలో కవిత చదవడం మొదలు పెట్టాడు. అది 'ప్రేమాంకురం' అనే శీర్షికతో రామనాథన్ రాసిందే. "నీ లాగా నీ కవిత కూడా గొప్పగా ఉంది. నీలో ఎంత క్రమశిక్షణ ఉందో నీ కవితలో అందే ఉంది". వ్యంగ్యం గుప్పించాడు కృష్ణ అయ్యర్. "నీ కవిత ఛందస్సుకు అందనంత గొప్పది" అని అంటూ పత్రిక టేబుల్‌పై పడేసి, లేచి నిలబడ్డాడు.

"ఛందస్సుకు అందకపోవడానికి నాకు ఛందస్సే తెలియదు' ' అన్నాడు రామనాథన్ చేతులు తిప్పుతూ

"ఛందస్సు తెలియకుండా కవితేం రాస్తావు ?" ఎత్తి పొడిచాడు అయ్యర్.

"ఛందస్సు తెలియదు. కవిత రాయడం మాత్రం తెలుసు !!"

"ఇది కవిత అనుకుని నిన్ను నువ్వు మోసం చేసుకుంటున్నావు'

"అవును. ప్రేమ, దాంపత్యం, క్రమశిక్షణ, సత్ప్రవర్తన అన్నీ మనల్ని మనం మోసం చేసుకోవడానికి పెట్టుకున్న మారు పేర్లు" అని తనకు తాను అనుకుంటున్నట్లుగా అని, కిటికీ దగ్గరికి వెళ్ళాడు రామనాథన్. ఎక్కువ చదువుకుని అన్యాయంగా చెడి పొయ్యాడని అతణ్ణి జాలిగా చూశాడు కృష్ణ అయ్యర్. కాని అదే సమయంలో "నా రాజా ! నీకు నచ్చిన అమ్మాయినే పెండ్లి చేసుకోరా" అని తన ముప్పయి అయిదేళ్ళ కొడుకుని అతి దీనంగా బ్రతిమిలాడుకున్న రామనాథన్ ముసలి తల్లి అతని కళ్ళలో తిరిగింది. కిటికీలోంచి బయటికి చూస్తున్న రామనాథన్ భుజాన్ని తట్టి, కృష్ణ అయ్యర్ చివరి మాటగా అన్నాడు.

"రామనాథన్ నిన్ను చూస్తుంటే నాకు ఎందుకో జాలి కలుగుతోంది. మీ అమ్మ చెప్పి వెళ్ళినట్టు, నిన్ను నేను సరిదిద్దలేనని తేలిపోయింది. ఇక నీ ఇష్టం. కాని ఒకటి మాత్రం నిజం - నువ్వేదో పెద్ద కవిత రాశావే - నిన్ను నువ్వు మోసం చేసుకుంటున్నట్లుగా వేశ్యలు తమను తాము మోసం చేసుకోవడం లేదని గ్రహించుకో. నీ కవితలో, నీ జీవితంలో ఛందస్సుకు స్థానం లేదంటే లేకపోవచ్చు. కాని ఆ వేశ్యల జీవితంలో ఉంది. విటుల్ని ఆకర్షించి, మోసం చేసి, డబ్బు గుంజడం వారి ఛందస్సు !! చేతిలో డబ్బు లేకుండా మన్మధుడు వచ్చినా సరే - 'నువ్వా నీ ప్రేమా ఎవడిక్కావాలి ? - వెళ్ళు వెళ్ళు' అని తన్ని తరివేయడమే వారి వ్యాకరణం !! ఈ సూక్ష్మాన్ని అర్థం చేసుకుంటే వాళ్ళ కోసం తిరగడం ఎంత బుద్ధి తక్కువ పనో నీకే అవగత మౌతుంది. ఏమైనా బాగా చదువుకున్న వాడివి. అన్నీ తెలిసిన వాడివి. నీ బుద్ధిని ఉపయోగించి ఒక మంచి నిర్ణయానికి రా. అంతే మేం కోరుకునేది" - అని ఇక తాను చెప్పాల్సింది అయిపోయినట్టు లేచి, విసవిసా వెళ్ళిపొయ్యాడు. కృష్ణ అయ్యర్ వెళ్ళిన తర్వాత టేబుల్ మీది పత్రికపై రామనాథన్ దృష్టి పడింది. అందులో తాను రాసిన ఛందస్సుకు అందని కవిత 'ప్రేమాంకురం' స్పష్టంగా కనిపించింది. 'ఛందస్సులో రాసినంత మాత్రాన ప్రతిదీ కవిత్వమై పోతుందా ?' అనే ప్రశ్న అతని మనసులో కదిలింది.

ఆఫీసు నుండి ఇంటికొస్తూ బస్సు స్టాండ్‌లోని మాగజైన్ షాపులో ఆ వారం 'శోధన' పత్రిక కొనుక్కుని పేజీలు తిరగేశాడు రామనాథన్. గత వారం ప్రచురింపబడ్డ తన కవితపై ఎలాంటి అభిప్రాయాలు వచ్చాయో చూసుకోవాలన్న ఆసక్తి కొద్దీ ఉత్తరాల శీర్షిక కోసం వెతికాడు. అందులో బాక్స్ కట్టి ఒక చిన్న ఉత్తరం కనిపించింది. "షాజహాన్ తన ప్రేమ చిహ్నంగా, ప్రియురాలి జ్ఞాపకార్థంగా తాజ్‌మహల్ అనే మహత్తరమైన కట్టడం కట్టించాడు. అది ఒక ప్రియుడు తన ప్రియురాలికి ఇచ్చిన మామూలు కానుక కాదు. 'ప్రేమాంకురం' శీర్షికతో కవిత రాసినకవి ఎవరో అని ఉట్టి బూజుకవి. పరమనీచుడు. ఇతగాడికి షాజహాన్ అమర ప్రేమకు ఒక సామాన్యుడి ప్రేమకు తేడి తెలియలేదు. రెండు ఒకటేనన్నట్లు పోలిక చూయించి ఘోరమైన పాపానికి గురయ్యాడు. ఈ అసహ్యమైన కవితను ఈ ప్రపంచం మన్నించదు. ఛందస్సు లేకుండా ఇష్టం వచ్చినట్లు రాసిన ఈ వగరుబోతు మాటల్ని ఎవరూ ఒప్పుకోరు. కొత్త రకమైన కవితగా ఆహ్వానించి ప్రచురించిన ఈ పత్రిక సంపాదకుడు కూడా క్షమార్హుడు కాడు. ఈ కవిత సున్నిత మనస్కులను గాయ పరిచేదిగా ఉంది" - అని ఒక పాఠకుడు రాసిన ఘాటైన ఉత్తరం చదువుకుని, తలవంచుకుని నడుస్తున్న వాడల్లా పబ్లిక్ ప్లేస్ అని కూడా మరిచిపోయి పెద్దగా నవ్వాడు. తలవంచుకుని పోతున్న ఈ సమాజాన్ని ఒక దెబ్బ తీసి, ఒక సంచలనం కలిగించానని ఎక్సయిట్ అయిపోయిన రామనాథన్, ముందూ వెనకా చూసుకునే పరిస్థితిలో లేడు. తెరలు తెరలుగా మళ్ళీ పెద్దగా నవ్వాడు. ఆ నవ్వుకు ప్రతిధ్వనిగా ఒక అమ్మాయి నవ్వు వినిపించింది. ఆ నవ్వు అతనికి చక్కిలి గింతలు పెట్టింది. అసలే సంతోషంలో ఉన్నాడు. వెనక్కి తిరిగి చూస్తే బస్సుస్టాండు స్థంబాన్ని ఆనుకుని ఒక అమ్మాయి తదేకంగా అతన్నే చూస్తోంది. ఆమె అతణ్ణి చూసిన చూపు అతడికి అర్థమైంది. ఒక నవ్వుతో ఒక చూపుతో ఆమె అతణ్ణి పరిచయం చేసుకుంది ఆ తరువాత అక్కడి నుండి కదిలింది.

వలవేసి లాగితే, వల - వలతో పాటు వలలో పడిన చేపలూ కదిలి వచ్చినట్లు, ఆమె చూపులు గుచ్చుకుని అతను ఆమెను అనుసరించ సాగాడు. కొద్ది దూరం వెళ్ళిన తరువాత ఓ సందు మలుపు దగ్గర ఆమె అతని కోసం నిలబడింది. అక్కడి దాకా అపరిచితుల్లాగా నడిచిన వాళ్ళిద్దరూ, ఆ చిన్న సందులో దూరగానే అన్యోన్య దంపతుల్లాగా కలిసి నడిచారు. అంత పెద్ద నగరంలో ఇంత చిన్న సందు వుండడం రామనాథన్‌కు ఆశ్చర్యాన్ని కలిగింది. ఇలాంటి సందులో సంచరించడం తన గౌరవానికి భంగం అని అతడు ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకంటే అసలు అలాంటి అవకాశం కలిగిందే ఇప్పుడు ! అక్కడ చాలా గుడిసెలు ఉన్నాయి. సందు చివరలో ఒకటి రెండు పెంకుటిళ్ళున్నాయి. ఒకదాంట్లో ఒక సాయబు చాయ్‌కొట్టు పెట్టాడు. అదే ఆ ప్రాంతానికి కిరాణా షాపు కూడా. సిగరెట్లు, కిళ్ళీలు, సోడాలు కూడా అక్కడే దొరుకుతాయి. సందుకు మరో వైపు మురికి కాలవ పక్కగా రేపు డబ్బా కొట్టులో ఒక ముసలమ్మ గారెలు కాలుస్తూ ఉంది. ఆ గారెల వాసన ఆ సందును తికమకలు చేస్తూ ఉంది. పేడ కుప్ప మీద అర్ధ నగ్నంగా వున్న కొందరు పిల్లలు ఆకాశాన్ని పట్టే ప్రయత్నంలో గాలి పటాలు ఎగరేస్తున్నారు. వీటినన్నిటినీ దాటి, చాలా యేళ్ళుగా సున్నం వేయని మాసిన గోడల ఒక ఇంటిముందు ఇద్దరూ ఆగారు. ఆ ఇంటి ఇటుకలన్నీ చిట్లి బయటికి కనిపిస్తున్నాయి.

ఆమె నడుము నుండి తాళం చెవి తీసి, ఇంటి తాళం తీస్తూ వుంటే, ఇంటి ముందు వాళ్ళు చుట్టుపక్కల వాళ్ళూ అంతా గుంపులు గుంపులుగా అక్కడ గుమిగూడి, వాళ్ళిద్దరినీ అనాగరికంగా చూస్తూ నిలబడ్డారు ! వాళ్ళంతా ఆడవాళ్ళే !! ఏదో ఒక అజ్ఞాత భావంతో గుంపులోని ఆడవాళ్ళు ఒకరినొకరు చూసుకుని కన్ను కొట్టుకున్నారు. ఆమె ఇంటి తలుపు తీసి, అతని వైపు తిరిగి, స్వాగత వచనంలా ఒక చిరునవ్వు నవ్వింది. అతడు ఆమె వెనక ఇంట్లోకి అడుగేసే ముందు ఏదో జ్ఞాపకం వచ్చి, ఉన్న ఫళాన ఖంగు తిన్నాడు. చేతిలో వున్న

డబ్బంతా ఆ ఉత్తర భారతద్దేశపు అమ్మాయికి సమర్పించుకోవడం వల్ల ఆనెలంతా గడవడమే కష్టంగా ఉంది. బస్సుకు చిల్లర తప్ప జేబులో ఏమీ లేదు. అందులో చేతిలో డబ్బు లేకుండా మన్మథుడొచ్చినా తిప్పి పంపిస్తారని' - కృష్ణ అయ్యర్ చెప్పనే చెప్పాడు.

రామనాథన్ అనుమాన పడుతూ ఆగిపొయ్యే సరికి "లోపలికి రండి" - అని ఆమె ఆహ్వానించింది. "లేదు. ఇల్లు తెలుసుకుని పోదామని వచ్చాను. అంతే - ఇంకో రోజు వస్తాను" అని హీనస్వరంతో పలికాడు రామనాథన్. ఆమెకు కొంత వరకు విషయం అర్థమైంది. "ఏం ఇప్పుడు ముహూర్తం బాగులేదా ?" అంటూ ఛలోక్తి విసిరింది. రామనాథన్ ధర్మ సంకటంలో పడ్డాడు. ఇక దాపరికం మంచిది కాదని డబ్బు దగ్గర లేని విషయం స్పష్టంగా చెప్పాడు. అది ఆమె వినిపించుకోనట్లుగా "సరే వీధిలో నిలబడి ఎందుకూ ? లోపలికి రండి ముందు. నిదానంగా మాట్లాడుకోవచ్చు" అంటూ ఇంట్లోకి వెళ్ళింది. అనుమానంగానే అతడు వెంట వెళ్ళాడు. తలుపులు మూసుకుని లోపలి గడె టక్కున పడిపోయింది. మూసిన తలుపులకు అడ్డంగా నిలబడి, చేతుల్ని గుండెల మీద పెట్టుకుని, అతన్ని ఓరగా చూస్తూ రెచ్చగొట్టేట్టుగా నవ్వింది ఆమె. ఆడ రౌడీలాగా నిర్లక్ష్యంగా అతడి జుబ్బా పట్టి లాగింది. "ఏం మగాడి వయ్యా నువ్వూ ? డబ్బు లేకుండా ఈ కార్యక్రమానికి రావొచ్చా చెప్పు ? పైగా వలపుల తలపులతో జోరు జోరుగా వచ్చావు "

ఆమె నవ్వులో, నిర్లక్ష్యపు మాటలో ఏదో ఒక రకమైన స్త్రీత్వపు ఆకర్షణ అతని మనసు నిండా నిండింది. జుబ్బా పట్టుకుని లాగిన ఆమె చేతిని అతను గట్టిగా పట్టుకున్నాడు. ఆమె చెయ్యి నిమిరి, ఓదార్పే రీతిలో అప్యాయంగా - తను మోసం చేసి పోవడానికి రాలేదని, పొరపాటున జేబులో డబ్బు చూసుకోకుండా అలవాటుగా వచ్చానని .. ఆ మరునాడు తప్పక వస్తాననీ చెప్పి, తలుపు తెరవబోయాడు.

"ఉష్ - ఇప్పుడే వెళ్తారా ? సిగ్గు పోతుంది" - అంది ఆమె. ఆమె చెప్పేదేమిటో అర్థం కాక అతను అయోమయంగా చూశాడు.

"మీరు ఇంట్లోకి వచ్చేప్పుడు బయట అమ్మాయిల్ని చూశారు కదా ? వాళ్ళు నన్ను ఎంతో ఈర్ష్యతో చూస్తూ నిలబడ్డారు గమనించారా ? మీరు వెంటనే బయటికి వెళితే డబ్బు తగాదాతో బెడిసి కొట్టింది అని చప్పట్లు చరిచి గేలి చేస్తారు. ఇచ్చేది ఇవ్వండి. మీకూ అవమానం తప్పుతుంది". అంటూ లోనికి వెళ్ళి చాప తీసుకు వచ్చింది. చాప పరిచి కూర్చోమని సైగ చేస్తూ "కాసేపుండి వెళ్లరు గానీ, రండి కూర్చోండి. చాపకు అద్దె లేదు" అని గల గలా నవ్వింది. అతడు కూర్చున్నాడు. హాల్లో వున్న వెదురు బొంగు దండెం మీది నుండి కట్టుడు చీరొకటి లాగి "ఒక్క నిముషం' అని స్టైల్‌గా చెబుతూ చలాకిగా మరో గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది.

రామనాథన్ జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ బయటికి తీసాడు. అందులో ఒకే ఒక సిగరెట్ ఉంది. సిగరెట్ పెట్టెను ఏష్ ట్రేలా వాడుకోవడానికి అనువుగా చించి, సిగరెట్ వెలిగించుకుని దమ్ము పీల్చి తనూ కూర్చున్న గదిని కలయ చూశాడు. నిజానికి అది చిన్న హాలు. దానిని అనుకుని ఒక చిన్న గది. పక్కనే వంటిల్లు లాంటి ప్రదేశం. అంతే !! ఇల్లున్నదే అంత. ఇంటి వెనక వేగంగా ప్రవహించే మురికి కాలువ హోరు. అటు నుండి గాలి వీచినప్పుడల్లా మురికి వాసన. పై కప్పు వంగిపోయిన తీరు. వర్షపు నీళ్లకు తయారైన ఆకుపచ్చని చారలు ఆ ఇంటి వాతావరణాన్ని, ఆర్థిక స్థితిని ఉన్నదున్నట్లు నివేదించుకున్నాయి. "ఇవి చూస్తూ ఉండండి" అనే మాట వెనకనే చిన్న గదిలోంచి రెండు పత్రికలు దూసుకొచ్చాయి. రామనాథన్ వాటిని కాసేపు తిరగేశాడు.

చీర మార్చుకుని బయటికి వచ్చిన ఆమె హాల్లో స్థంభాన్ని పట్టుకుని, ప్రేమగా అతని వైపు చూసింది. సౌమ్యంగా మంచి అమ్మాయిలాగా కనబడింది. "నన్నెప్పుడైనా చూసిన జ్ఞాపకం ఉందా మీకూ" అని అడిగింది. నిర్లక్ష్యంగా ఆడరౌడీలా నవ్విన నవ్వుకి, చీర మార్చుకోవడానికి వెళుతూ కొట్టిన స్టైల్‌కి ఇప్పుడు అమాయకంగా అడుగుతున్న దానికీ ఎక్కడా పొంతన లేదు. పోలిక లేదు. ఒక స్త్రీ ఇన్ని రకాలుగా ఎలా మారగలదు? అని ఆలోచనలో పడ్డాడు రామనాథన్.

పోనీటెయిల్‌గా కట్టి వున్న జుట్టును విప్పేసి, జడగా అల్లుకుంటూ అతని వైపు చిరునవ్వు విసిరింది. "మీరు నాకు ముందే తెలుసునండోయ్. పది రోజుల క్రితం సినిమా థియేటర్లో చూశాను. నన్ను చూస్తారేమో నన్న ఆశతో రెండు సార్లు నవ్వాను కూడా ! అయితే తర్వాత తెలిసింది. మీరు ఆ నార్త్ ఇండియా అమ్మాయితో తిరుగుతున్నారని. సరే ఇక నేనెందుకూ అడ్డం అనుకుని అప్పటికి వదిలేశా' '

"ఓ - ఆ రోజా ? నీకు ఆ అమ్మాయి తెలుసా ?"

"తెలుసు. కాని పరిచయం లేదు. ఈ ఊళ్ళోనే ఉంటోంది. చాలా సార్లు చూశాను"

"లేదే. రెండ్రోజులు క్రితమే బొంబాయి నుండి వచ్చానని ట్రావెలర్స్ బంగళాలో ఉంటున్నానని చెప్పిందే తను ?"

అదివిని ఆమె తల వంచుకుని లోలోపలే నవ్వుకుంది. తమను తాము మోసగించుకునే వృత్తిలో వేరొకరిని మోసం చేయడం పెద్ద తప్పా ? - అని అనుకుంది. అతడికి ఆమె నవ్వు వినిపించక పోయినా .. అతడు గ్రహించాడు.

స్త్రీలో గాని, కవి తన మార్ధవ రసికత్వానికీ యీ లోకపు కర్కశత్వానికీ సమన్వయాన్నీ కనిపెట్టలేడు

– చలం

"అలవాటుగా వచ్చేశాను అని మీరు నాకు చెప్పక ముందే నాకు తెలుసు, మీరు అలవాటు పడ్డ వారని.

"అవును ! నా కెంతో బాధగా ఉంది. నేను ఇప్పుడు బయటికి వెళ్ళాలి కదా ?" సిగరెట్ పొగ పక్కకు వూది అన్నాడు.

"ప్లీ - మీరేమీ బాధ పడాల్సింది లేదు. అలవాటుగా మీరొచ్చినట్లే, అలవాటుగా నేను మిమ్మల్ని తీసుకొచ్చాను. నిజానికి నాకు ఈ రోజు బయటికి వెళ్ళాల్సిన పనే లేదు. కాని, సంపాదించుకునే వీలున్నప్పుడే సంపాదించుకోవాలి కదండీ ఈ వృత్తిలో - అయినా ఇక ఇవ్వాళ బయటికి వెళ్ళను లెండి. నా దగ్గర బోలెడు డబ్బుంది - చాలు ".

"బోలెడు అంటే మస్తుగానా ? నూరా ? రెండు నూర్లా ?" తల ఎగరేశాడు రామనాథన్.

"అబ్బో ఎవరిస్తారండి అంత డబ్బు ? నిన్నొక ముప్పయి దొరికాయి. ఖర్చులవీ పోను ఇంకో ఇరవై చిల్లర ఉన్నాయి. ఏం మీకేమైనా అప్పు కావాలా ? వేళాకోళం కాదు, నిజంగా అడుగుతున్నాను. చెప్పండి నిజంగా -" 'నిజంగా' అనే పదం రెండు సార్లు ఉపయోగించినప్పుడు, మొదటి సారి ఆట పట్టించేందుకు అడిగినట్లుగానూ రెండో సారి మనస్ఫూర్తిగా అడిగినట్లుగానూ అతనికి అనిపించింది. వెంటనే అతను గనక అడిగి వుంటే, తప్పకుండా ఆమె తన దగ్గరున్న డబ్బంతా ఇచ్చేసి ఉండేదని అతనికి అనిపించింది.

ఆమె చెప్పిందంతా వింటూ చేతిలోని సిగరెట్ చివరి సారిగా పీల్చుకుని, ఖాళీ పాకెట్ ఏష్ ట్రలో పీకను నలిపివేశాడు. నవ్వుతూ ఆమె వైపు చూశాడు. "అవునూ మీ దగ్గర ఎంత డబ్బుందో మీరు చెప్పనే లేదు" అంది ఆమె.

"నా దగ్గరా ? నువ్వంత స్పష్టంగా చెప్పిన తర్వాత నేను మాత్రం దాచడం దేనికీ? -" అంటూ చేతిలో మడత పెట్టి వున్న శోధన పత్రికను కింద పడవేశాడు. తర్వాత జేబులోంచి గది తాళం చెవి తీశాడు. పర్సులోంచి పదిహేడు పైసలు దులిపాడు.

"ఇదేమిటీ ?"

"గది తాళం చెవి"

"సాయంత్రం కాఫీ తాగారా ?"

"లేదు. ." "తాగాలనే వెళ్ళాను. కాని దారిలో పత్రిక కొనేశాను"

"ఇదేం పత్రిక? చాలా బావుందే ? .. ఇది చూసేనా నడిరోడ్డుమీద పిచ్చోడిలాగా నవ్వుతున్నారు?" - అంటూ పత్రిక తీసుకుని తిరగేసింది. మధ్యలో ఏదో గుర్తొచ్చిన దానిలా పత్రికతో సహా వీధి గుమ్మం దాక వెళ్ళి, తలుపు తీసి, తల బయటికి పెట్టి "ఒరేయ్ వెధవా ? ఎక్కడరా ?" అని ఎవరినో ప్రేమగా పిలిచింది. వెంటనే పదేళ్ళ కుర్రవాడొకడు వచ్చాడు. హాల్లో కూర్చున్న రామనాథన్‌ని దొంగ చూపులు చూస్తూ నిలబడ్డాడు.

"కాకా హోటల్‌కెళ్ళి ...." ఏదో చెప్పబోతూ వెనక్కి రామనాథన్ వైపు తిరిగి "ఇక్కడ కాఫీ దొరకదు. టీ తెప్పిస్తున్నాను" అని చెప్పింది. మళ్ళీ కుర్రాడి వైపు తిరిగి "రెండు స్ట్రాంగ్ టీ -బాగా మలాయ్ వేసి ...!' వెనక్కి తిరిగి "మీకు మలాయ్ ఇష్టమేనా ?" అని మళ్ళీ అడిగింది.

"ఓ - నాకు చాలా ఇష్టం !" అన్నాడు రామనాథన్. చనువు పెంచుకుంటూ -

"వూ ( సారువారు పెద్ద పెద్ద హోటళ్ళల్లో తిరుగుతారు. ఈ టీ కొట్లలోని టీ ఇష్టపడతారో లేదో" స్వగతంలో అనుకోవాల్సింది పైకి అంటూ "నువ్వెందుకురా నోరు తెరుచుకుని అలా నిలబడ్డావ్ ? పరిగెత్తు - ఇదిగో డబ్బులు" ..... "ఉండుండు. ఇంకేమైనా కావాలేమో కనుక్కుంటాను ... సిగరెట్టు లేనట్టుంది కదా ?-" రామనాథన్‌ను అడిగినట్టుగానే అడిగి, పాత సిగరెట్ ప్యాక్ తీసిచ్చింది. "ఇదిగో ఈ సిగరెట్ పెట్టి తీసుకురా "

"సగం ప్యాకెట్ చాలు" అన్నాడు రామనాథన్ లోపలి నుండి.

"ఏం పాపం ?" రామనాథన్‌ను మందలిస్తూ "ఒక పెట్టె తీసుకురారా" అని కుర్రాడికి చెప్పి మరికొంత డబ్బు ఇచ్చింది. తిరిగి వచ్చి చాప చివర కూర్చుని 'శోధన' పత్రిక పేజీలు తిప్పింది. "అవునూ ఇదేం పత్రిక ? ఒక్క బొమ్మలేదు. ఒక్క ఫోటో లేదు, దీనికి యాభయి పైసలా ? ఎవరైనా కొంటారా ?" అని ఆమె అనుమానపడింది.

"ఎందుకు కొనరూ ? నీలాంటి వాళ్ళు నాలాంటి వాళ్ళు కొంత మందైనా వుంటారు కదా ?" అన్నాడు రామనాథన్.

"మీతో పాటు నన్నెందుకు చేర్చుకుంటారు ? నేనేం ఇలాంటి పత్రికలు కొనను. నేను కొనేవి ఇదిగో ఇవి -" అని పక్కన పడివున్న కొన్ని వారపత్రికలు తీసి చూపింది. "వీటిలో సీరియల్స్ వస్తాయి. ఒక్కొక్క వారం ఏం జరుగుతుందో చూద్దామని ఎంత ఉబలాట పడతానో చెప్పలేను" అని ఉత్సాహం ప్రకటించింది. ఆ పత్రికల మీద సరళ అని వున్న ఇంగ్లీషు సంతకం చూసి అతను అడిగాడు.

"నీ పేరు సరళా ?"

"ఊ (" అతని వైపు చూడకుండా అంది. బొమ్మల్లేని ఆ పత్రికలో ఆమె ఏదో చదువుతూ ఉంది. రామనాథన్ ఆమెనే చూస్తూ కూర్చున్నాడు. కాసేపు ఇద్దరి మధ్య మౌనం -

"సరళా ! నిన్నేదైనా అడిగితే తప్పుగా అనుకోవు కదా" అంటూ ఏదో అడుగుదామని అనుకున్న రామనాథన్ ముఖంలోకి ఆమె తలెత్తి చూసింది. ఒక్క చూపుతోనే అతని మనసులోని ప్రశ్న ఏమిటో గ్రహించింది. "ఒద్దండి !. మీరేం అడగబోతున్నారో నాకు తెలుసు. నువ్వెవరు ? నీ కథేమిటి ? పాపం ... ! నువ్విలా ఎలాగయ్యావూ ? ఇదే కదా మీరు అడగబోయేది ? ఈ ప్రశ్నలడగని మొగోణ్ణి నేనింత వరకు చూడలేదు". అంతలోనే ఆమె ముఖంలో ఏదో కాఠిన్యం చోటు చేసుకుంది.

"ప్రతి వాడి దగ్గరా ఏదో ఒక అబద్ధం చెప్పాల్సి వస్తోంది. ప్రతి వాడికీ ఓ కథ కావాలి. సమాజ పతనానికి కారణాలేవో వెతుక్కుని బాధ నటించడానికి, మొసలి కన్నీళ్ళు కార్చడానికి మా బాధల ఇతి వృత్తాలు కావాలి. ఈడియట్స్ ! హిపోక్రేట్స్ ! ! ... దయచేసి మీరు ఏమీ అడక్కండి. మీ దగ్గరైనా అబద్ధం చెప్పకుండా ఉంటాను". ఆమె ముఖంలో కనిపించని కోపం, విషాదం, విసుగు, చికాకు ఒక్క క్షణంలోనే ఎంతో అలిసిపోయినట్లుగా కనిపించింది. "నేనెట్లున్నానో,

అదే విధంగా ఆరూపంలోనే మీరు నన్ను చూడాలి. ఇదొక వృత్తి కదా? ఈ వృత్తితో సంబంధం లేని వాళ్ళు దూరం నుండే నన్ను తిట్టొచ్చు. లేదా జాలి పడొచ్చు. అంతేకాని, ఇదొక వృత్తి అని తెలిసి ఇక్కడ ఏం దొరుకుతుందో తెలిసి, ఇక్కడ నేను ఏది అమ్ముతున్నానో అది కొనుక్కుందామని వచ్చి 'అయ్యో నీ గతి ఇంతేనా?' అని అడిగే ప్రశ్న ఎంత అసంబద్ధమైనది? ఎంత అయోగ్యమైనది ? ఎంత అనర్హమైనది .. ?" ఉద్రేకంగా ఆమె పలికే ఒక్కొక్క మాట ఒక్కొక్క చెంప దెబ్బలా అనిపించింది రామనాథన్‌కు. నిజానికి అతను అదే ప్రశ్న అడుగుదామని అనుకున్నాడు. కాని అడగక ముందే గ్రహించి ఆమె ఇంతగా కలత పడుతుందని ఊహించలేక పొయ్యాడు. అందుకే కొద్దిగా సర్దుకుని "లేదు సరళా లేదు. నేను అటువంటి ప్రశ్నేదీ నిన్ను అడగదలుచుకోలేదు. నువ్వు నామీద ఇంతగా ఆదరాభిమానాలు ఎందుకు కురిపిస్తున్నావో అర్థం కాక అడుగుదామనుకున్నాను. అంతే -" అన్నాడు బెరుకు బెరుకుగా.

"ఎందుకంటే, నువ్వు నాకు నచ్చావు" అని ఆమె ఏకవచనంతో అనే సరికి ఏదో ఆత్మీయత పెరిగినట్లు భావించాడు రామనాథన్. "నా ఇష్టం ! నేను ఎవరికీ జవాబు దారీ కాదు. ఒక గౌరవమైన వ్యక్తితో నేనూ గౌరవంగానే మసలుకుంటే తప్పా ? మాకు ఇక మానవ సంబంధాలు ఉండే పని లేదా ? డబ్బే ప్రధానమా ? ఇప్పుడు ఎవరైనా వందరూపాయలు తీసుకుని నా దగ్గరకి వస్తే "ఛీ - ఫో - ఇప్పుడు కాదు" అని చెప్పేస్తాను. నా ఇష్టం. నా మనసు. డబ్బెవడిక్కావాలి? థూ -" అంటూ ముఖం అసహ్యంగా మార్చి తల వంచుకుని కూర్చుంది. కొద్ది సేపటి తర్వాత కొంచెం నెమ్మదించి, గొంతు తగ్గించి మళ్ళీ మాట్లాడ సాగింది.

"ఊఁ డబ్బుకూడా అవసరమే, కాని. డబ్బు వుంటే చాలునా ? అలా గయితే డబ్బున్న ప్రతివాడూ హాయిగా డబ్బు చూసుకుంటూ వుండొచ్చుకదా? తెచ్చి నా దగ్గర ఎందుకు పారబోసుకుంటున్నాడు. నేను కూడా డబ్బు కూడ బెట్టడానికేనా ఉన్నాను? వాడిచ్చిన డబ్బు వేరొక చోట ఇచ్చి నాకేం కావాలో అది కొనుక్కుంటున్నాను కదా? డబ్బు, డబ్బు డబ్బు - అసలు డబ్బంటే అర్థమేమిటి? నీకేది కావాలో అది నీవద్ద లేదు. డబ్బనేది ఎవరికి ఏం కావాలో అది కొనిస్తుంది. అంతే కదా డబ్బు విలువ ? డబ్బు పెడితే దొరకనివి కూడా ఉన్నాయి. వాటినేం చేద్దాం ?" - అంటూ ఆమె చెప్పే మాటలు మౌనంగా వింటూ కూర్చున్నాడు. అయితే ఆ మాటలు అతనిలో ఎంతో సంచలనం సృష్టిస్తున్నాయి. "నువ్వు డబ్బు తీసుకుని వచ్చి వుంటే, ఆ డబ్బును నీ దగ్గర నుండి ఎలా రాబట్టుకోవాలా అని మాత్రమే ఆలోచించేదాన్ని. ఇద్దరూ సంతోషంగా ఉండాలంటే ఎవరో ఒకరు ఖర్చు చేయాలి. ఇదే ఇందులోని ఆర్థిక సూత్రం ! ... నా వద్ద డబ్బుంది. నేను ఖర్చు పెడుతున్నాను. ఖర్చు చేయడంలో కూడా ఎంతో సంతోషముంది .. అయితే, 'ఛీ - ఈ బజారు ముండ నా కోసం ఖర్చు చేయగలిగేది అయ్యిందా?' అనే తేలిక భావం ఏదైనా మీ మనసును తొలుస్తూ వుంటే గనక you are welcome to get out - !!

# హేత్వాతీత వాదం

– కీ॥శే॥ పి. హనుమయ్య.



వెనుక ఉన్న మనిషి
మనం వెనక్కు తిరిగి చూస్తే
ముఖా ముఖీ గా కన్పిస్తాడు.
అలా కాక
ముక్కుకు సూటిగా వెళ్ళామో!
యావద్భూగోళాన్ని చుట్టి వస్తేగాని
అతణ్ణి మళ్ళీ చేరుకోలేం.
అప్పటికే అతనికి కనిపించేది వీపే,
అంతవరకు
మన దేహం-ఓపిక- ఓర్పు
బ్రతికి ఉండటం చాలా దుర్లభం
శాస్త్రి గారూ!
దేవుడి సంగతి గూడా సరిగ్గా ఇంతేనండీ!
ముక్కు సూటి తర్కం వదలండి.
వెనక్కి తిరిగి మనస్సాక్షినడగండి.

("యుగోదయంలో నా ప్రార్థన"- అనే అముద్రిత కావ్యంనుండి.)

"లేదు సరళా లేదు. నిన్ను నేను అర్థం చేసుకున్నాను. నిన్ను నాతో సమానంగా భావిస్తున్నాను" అని అన్నాడు. అలా అనేప్పుడు రామనాథన్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అది గ్రహించిన సరళ - "నేనేదైనా తప్పుగా మాట్లాడితే క్షమించండి. మీ మీద నాకు ఏ కోపమూ లేదు". అని చెబుతూ అతని చెయ్యి చేతిలోకి తీసుకుంది. ఆ సమయానికే టీ తెచ్చిన కుర్రాడు వచ్చాడు. దాంతో వారిలో విజృంభించిన సున్నితమైన భావనలు చల్లబడ్డాయి. ఇనుప ఫ్రేం లోంచి చకచకా రెండు టీ గ్లాసులు తీసి బయట పెట్టాడు. సిగరెట్ డబ్బా, చిల్లరడబ్బులూ రామనాథన్ ముందుంచాడు. కదలకుండా అక్కడే నిలబడ్డాడు. "వాడి కేమైనా డబ్బిచ్చి పంపండి " అని చెప్పింది సరళ. రామనాథన్ చాప మీది నుండి పదిహేను పైసల చిల్లర తీసి వాడికి ఇచ్చాడు.

"ఒరేయ్ - ఒరేయ్ అంత డబ్బా నీకు? పదిహేను పైసలే? అయినా ఇచ్చాడు కదా దానకర్ణుడు.. ఇక ఫో - తర్వాత వచ్చి గ్లాసులు తీసుకుపోదువు గానీ" అని చెబుతూ రామనాథన్‌ను చూసి కన్ను కొట్టింది. కుర్రవాడు కృతజ్ఞతా భావంతో రామనాథన్‌కు నమస్తే చెప్పి బయటికి పరిగెత్తాడు. ఆమె టీ తీసి అతనికి అందించింది. తన గ్లాసులోని మీగడను అతని గ్లాసులోకి ఒంపింది. "యేం మీగడ నీకు చేదా ?" - అని అడిగాడు.

"మీకు బాగా ఇష్టం కదా అందుకని !" - అని అంది టీ తాగుతూ వుండగా అతణ్ణి చూసి, "నిజంగానే నువ్వు నాకు నచ్చావ్" అని అది. కాసేపు అయిన తర్వాత "మీరు నా పేరు తెలుసుకున్నారు గనక, నేను మీ పేరు తెలుసుకోవచ్చా?" - అని అడిగింది.

"రామనాథన్ !"

"అవునూ - మీరు గదిలో ఒక్కరే ఉంటారు కదా ? డబ్బు ఇష్టం వచ్చినట్టు ఖర్చుపెట్టి, ఇబ్బంది పడొచ్చా ? ఆదుకునే వారెవరూ ?"

"ఇష్టం వచ్చినట్టు ఖర్చు పెడతానని ఎవరు చెప్పారూ ?"

"ఒకరు చెప్పాల్సిన పనిలేదు. మనిషిని చూస్తేనే తెలుస్తోందయ్యే - అది సరే .. డబ్బు లేకపోతే ఇవాళ రాత్రి భోజనానికి ఎట్లా ?"

"దానికేం ఢోకాలేదు. మా లాడ్జిలో ప్రతి నెలా ఫస్టుకే బిల్ తీసుకుంటారు".

"అయితే సరే - ఈరోజు మీరు నా అతిథిగా ఉండండి. కాదని చెప్పగూడదు. మీరు ఇక్కడ భోం చెయ్యాలని అడిగాను. మీరు చేస్తున్నారు. అంతే ! నేను చాలా బాగా వంట చేయగలను." అని చెప్తూనే ఎందుకో ఒక్క సెకను ఆగింది. మళ్ళీ వెంటనే అదే ఉత్సాహంతో భోజనానికి ఉండమంది.

"ప్రతి వారికీ కొన్ని పరిధులు ఉంటాయి కదా ?" అన్నాడు రామనాథన్.

సరళ అదేమీ వినిపించుకోలేదు. "మీరిక్కడ భోజనం చేయ బోతున్నారు. అంతే - ఇక మీరు మాట్లాడొద్దు. చాలా రోజుల తర్వాత నేనే వంట చేయబోతున్నాను" అని చెబుతూ వంట కార్యక్రమం ప్రారంభించడానికి పొయ్యి దగ్గరికి వెళ్ళింది. చీర కుచ్చిళ్ళు పైకి చెక్కుకుని, గిన్నెలు కడగడం మొదలు పెట్టింది.

"గిన్నెల పరిస్థితి చూస్తే నువ్విప్పాళ వంట చేసి తింది పెడతావన్న నమ్మకం లేదు" అన్నాడు రామనాథన్. ఆత్మీయంగా. తల మీద బయలుదేరిన చెమట చుక్క చెవుల పైకి రావడంతో సరళచేయితో తుడుచుకుంది. "తమకు తామే వంట చేసుకుని భోజనం చేయడమన్నది ఎంత ఘోరమైన విషయమో తెలుసునా ? అది వంట చేసే అనుభవం వున్న వాళ్ళకే తెలుసు. నావంట ఎలా వుందో రుచి చూడడానికి కూడా ఎవరూ లేనప్పుడు ఇక వంట ఎందుకు? మూడు రూపాయలు పడేస్తే భోజనం వస్తుంది. వంట చేసి మరొకరికి పెట్టి తాను తినే దాంట్లో వున్న సంతోషం మరెందులోనూ లేదు మీ దయవల్ల ఈ రోజు నాకు ఆ సంతోషం దొరకబోతోంది" అని చిన్నగా నవ్వింది సరళ. అయితే ఆ నవ్వులో సంతోషం కన్నా దుఃఖమే ఎక్కువగా కనిపించింది రామనాథన్‌కు.

గిన్నెలు కడిగి, పొయ్యి అంటించి ఎసరు పడేసింది. "మీ కేవి ఇష్టమో చెప్పండి. చేస్తాను" అని అడిగింది. జవాబు ఇవ్వడం అతడికి కష్టమైంది. "మీరు సహజంగా హాయిగా మాట్లాడండి. భోజనం లోకి ఇవి ఇవి కావాలని చెప్పడానికి ఎందుకు మొహమాట పడుతున్నారు?' ' చిరునవ్వుతో అడిగింది.

"రాత్రి పూట చారు, అప్పడం వుంటే చాలు. ఇక పంచభక్ష్య పరమాన్నాలతో సమానం".

"ఆఁ - అలా చెప్పండి.మీ సెలక్షన్ నాకు కూడా నచ్చింది. టొమాటో తో చారు పెడతాను. అప్పడం సరిపోతుందా లేక ఆలుచిప్స్, రసం, పెరుగు .." అతని ఇష్టంతో పాటు తను చేయదలుచుకున్నవి కూడా జోడించింది.

"ఓహ్హో హ్హో - టెర్రిఫిక్ !"

అతని నుండి ఆ మాట రాగానే చిన్న పెన్సిల్ ముక్క కాగితం తీసుకుని స్థంబానికి ఆనుకుని చిన్న లిస్ట్ తయారుచేసింది. వీధి తలుపు తెరిచి "రేయ్ సాంబేరి ! అని కేకేసింది. కుర్రాడు వెంటనే పరుగెత్తుకొచ్చాడు. వాడికో సంచి, డబ్బులు ఇచ్చి ఐదు నిముషాల్లో లిస్టులో వున్న సామానంతా తీసుకురావాలని చెప్పింది. వాడు ఎగురుకుంటూ వెళుతూ వుంటే "ఇక్కడున్నట్లు రావాలి" అని వెనకనుండి మరో సారి కేకేసింది.

ఆ రాత్రి మిసమిసలాడే పడుచు పిల్ల గాజులు గలగల లాడిస్తూ కొసరి కొసరి వడ్డించిన భోజనం రామనాథన్ చాలా సంతృప్తిగా ముగించాడు. ఆమె సహచర్యంలో దాంపత్య జీవితంలోని ఒక రకమైన సుఖం రామనాథన్ కనుగొన్నాడు. కాని, కనుక్కుని ఏం లాభం? తాజ్‌మహల్ కట్టిన షాజహాన్ మీద రామనాథన్‌కు అసూయ పెరిగింది.

జీవితాంతం కొనసాగే అలాంటి శాశ్వత సుఖం కోసం తాము జన్మనెత్తలేదని ఆమె, అతడూ గ్రహించుకున్నారు. ఆ రాత్రి వాళ్ళు అనుభవించిన ఆ సుఖంలో ఒక రకమైన విషాదం లీలా మాత్రంగా వెన్నాడుతూనే వచ్చింది. మరునాడు ఉదయం మసక మసక చీకటిలో

రామనాథన్ అక్కడి నుండి బయలుదేరాడు. గొళ్ళెం వేసుకోవడానికి ఆమె తలుపుదాకా వచ్చింది. ఆమె వద్ద సెలవు తీసుకునేటప్పుడు అతనికి మాటలు రాలేదు. కృతజ్ఞతలు చెబితే ఆమె ఏ మనుకుంటుందో ననుకుని, అసలు చెప్పకపోతే బావుండదనుకుని, "థాంక్స్" - అని తలదించుకున్నాడు. అతని కంటే పై మెట్టు మీద నిలబడిన ఆమె - కొత్తగా కనిపించే వయసు పిల్లవాడిలాగా, సిగ్గుపడుతూ నిలబడ్డ రామనాథన్ జుట్టును ప్రేమగా నిమిరింది. అతని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి "ఎందుకూ ? థాంక్స్ చెప్పడం ? నాకు ఒక మొగుడుంటే అతని దగ్గర నేను డబ్బు తీసుకోనుకదా?"- అని చెప్పేప్పుడు గుండె ఆగిపొయ్యేంత దుఃఖంతో పలుకుతూ .. ఏదో ఒక ఆసరా కోసం, ఆదరువు కోసం తపించి పోతున్న ఆమెను గట్టిగా పట్టుకున్నాడు రామనాథన్. ఆమె ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని, రెండు క్షణాలు ఆగి "సెలవా?" అని అన్నాడు. "వచ్చే వారం తప్పకుండా వస్తాను" అని చెప్పేప్పుడు అతని కళ్ళలో తిరగిన నీళ్ళు తళుక్కున మెరిశాయి.

"డబ్బు లేకుండా వలపుల తలపులతో జోరు జోరుగా వచ్చావే ?" అని అతణ్ణి ఆటపట్టిస్తూ క్రితం సాయంత్రం ఆమె అన్న మాటలు ఇద్దరికీ వినిపించాయి.

ఇప్పుడు వాళ్ళ హృదయాలు వున్న స్థితి ఏమిటీ? ఇలాంటి స్థితిని ఏమంటారు ? ప్రేమేనా ? "ఛీ ! కాదు" అని ఆమె మనసు చెప్పింది. ఆమె ముఖాన్ని అతడు మళ్ళీ చేతిలోకి తీసుకుని, వచ్చేవారం తప్పకుండా వస్తానని మళ్ళీ చెప్పినప్పుడు .. ఆమె హృదయం స్పందించింది. కాని వెంటనే యథార్థాన్ని గ్రహించి "చాలు చాలు నేను ఎవరికోసమూ ఎదురు చూడను. చూడకూడదు. ప్రేమికుల్లాగా వాగ్దానాలు చేసుకోకూడదు" అని కఠినంగా అననైతే అంది కాని ఏదో బాధలోంచి పుట్టుకొచ్చి జారిపడ్డ రెండు అశ్రువులు ఆమె చెక్కిళ్ళ మీద మెరిశాయి. అవి వజ్రాల్లాగా మెరిశాయి. వాటన్ని ఆపగలిగే శక్తి ఆమెలో లేకపోయింది. కన్నీళ్ళు కనబడకుండా తల ప్రక్కకు తిప్పుకుని "రేపటి గురించి మన కెందుకు బాధ ? నన్ను వెతుక్కుంటూ మీరొచ్చిన సమయానికి నేను వేరే వాడితో ఉండొచ్చును. నేను కావాలని అడిగేందుకు మీకేం హక్కుంది?"

ఒకరినొకరు వదిలి వెళ్ళలేక ఇద్దరూ అలాగే నిలబడ్డారు. అప్పుడే ఎదురింటి తలుపు తెరచుకుంది. ఒక స్త్రీ బయటికి వచ్చి ఇద్దరినీ చూసింది. "అదిగో చూడండి. నిన్న సాయంత్రం పెట్టిన పూలు, బొట్టు చెదిరిపోక అలాగే ఉన్నాయి. పాపం ! అర్థమైందా మీకూ ? సిగలో పూవు నలిగిపోక పోతే రాత్రి ఆమె ఉపవాసం ఉందని అర్థం. హుఁ. మేమంతా ఒకటేననుకోండి. నేను ఇక్కడ కొత్తదాన్ని. వీళ్ళంతా ఎంతో కాలం నుండి వుంటున్న వాళ్ళు. నేను పోటీకి వచ్చానని వాళ్ళు మొదట అసూయ పడ్డారేమో తెలీదు. తిట్టుకున్నారేమో తెలీదు.

.. సరే, మీరు మాత్రం తప్పక రండి. నేనే కావాలని మాత్రం రావొద్దు. నేను ఎవరికీ పోటీ కాను. నేను దొరకని సందర్భంలో అదిగో ఆ ఎదురింటి దాని దగ్గరకు వెళ్ళండి.. అయినా ఇవన్నీ చెప్పడానికి నేనెవర్ని" ఎదురింటి ఆడదాని ఆకలి రూపం చేసి ఆమె తనలో తాను ఎంతో సేపు గొణుక్కుంది. భావుకత లోంచి తేరుకుని, గట్టిగా నిట్టూర్చి "సరే వెళ్ళిరండి" - అని చెప్పి, ముఖం కూడా చూడకుండా నిర్దాక్షిణ్యంగా మొహం మీదే ధబీలు మని తలుపు వేసుకుంది. మూసిన తలుపును ఒక్క క్షణం చూసి, రోడ్డు మీద పడ్డాడు రామనాథన్. సందులోంచి మెయిన్ రోడ్డుకు తిరిగే చోట ఆగి, అపనమ్మకంతోనే వెనక్కి తిరిగి చూశాడు. లోపలికి వెళ్ళిన సరళ బయటికి వచ్చి వాకిట్లో నిలబడి చూస్తోంది. 'హమ్మయ్య' అనుకున్నాడు. చిరునవ్వుతో ఆమె టాటా చెప్పింది. అతను కూడా నవ్వుతూ టాటా చెప్పి, హుషారుగా నడవడం మొదలు పెట్టాడు.

ఆమె ఆమె కోసమే పోట్లాడి ఓడిపోతోందన్న ఆలోచనల రాగానే అతడి మనస్సు ఎందుకో బాధతో మూలిగింది. అన్నిటి కన్నా ఎదురింటి ఆడదాన్ని చూపి ఆమె సిగలో పూలు నలిగిపోలేదంటే రాత్రి ఆమె ఉపవానమనే అర్థాన్ని చెప్పిన సరళ మాటల్ని తలుచుకున్నాడు. కఠిన నిజాలకు కూడా ఒక రూపం ఉంది అనే విషయం తెలుసుకున్నప్పుడు అతడి కళ్ళలో నీటి తెర కదిలింది. వెంటనే అరచేయితో తుడుచుకున్నాడు. రామనాథన్ భావుకుడు.

ఇంట్లోకి వెళ్ళిన సరళ తలుపు మీద ఒరిగి, దుఃఖంతో కూడిన చిరునవ్వుతో ఒక నిట్టూర్పు వదిలింది. హృదయాలు ఘనీభవిస్తాయి. కళ్ళు ఊట బావులవుతాయి. కాని, ఒకరికి ఒకరు చెప్పుకోరు. ఒకరి వద్ద ఒకరు దాచుకుంటారు. ఇద్దరూ అలాంటి పరిస్థితిలోనే ఉంటారు.

రామనాథన్ లాడ్జికి తిరిగొచ్చినప్పుడు కృష్ణ అయ్యర్ డాబా మీద వ్యాయామం చేస్తున్నాడు. గదిలోకి వెళ్ళకుండా రామనాథన్ డాబా మీదికి వెళ్ళాడు. అక్కడ కృష్ణ అయ్యర్ మాట్లాడలేని స్థితిలో శీర్షాసనంలో ఉన్నాడు. అతనితో మాట్లాడకుండా కొంత దూరంలో పిట్టగోడ వద్ద నిలబడి ఉదయిస్తున్న సూర్యుణ్ణి చూశాడు రామనాథన్. రాత్రంతా నిద్రలేక పోయినా మానసికంగా, శారీరకంగా అతనిలో ఒకరకమైన ఉత్సాహమే ఉంది. "ఏయ్ కృష్ణ అయ్యర్ ! ఆరోజు ఏమో పెద్దగా వ్యాకరణం గూర్చి మాట్లాడాలే. ఛందస్సు గూర్చి లెక్చరిచ్చావే. ఇప్పుడేమైంది ? ఒక వేశ్య నీ వ్యాకరణాన్ని నీ ఛందస్సును నీ సిద్ధాంతాన్ని దాటి పోయింది. నేను ప్రత్యక్షంగా చూసి వస్తున్నాను"

> స్త్రీని అమితంగా ప్రేమించని వాడి రచనల్లో గొప్ప లోపం కనిపించి తీరుతుంది అసలు అట్లాంటివాడు కవి కాగలడా అని నా సందేహం.
>
> – చలం

అని గట్టిగా చెప్పాలనుకున్నాడు. కాని చెప్పలేకపొయ్యాడు. "అది, వేశ్యలకున్న ఛందస్సు నిబంధనల్ని ఫటా ఫట్‌న తెంపేసింది. ఇప్పుడామె "అది"కాదు. ఆవిడ. ఒక వ్యక్తిత్వమున్న మహిళ. నేనూ ? నేనింకా .. కృష్ణ అయ్యర్ చెప్పినట్లు స్త్రీ లోలుడినేనా ? అంతకంటే ఏమీ కానా? ఆదరించినందుకు కృతజ్ఞతలు చెప్పి ఎంతగా దిగజారాను? ఎంత స్త్రీ లోలుడినైనా ఆమెకు అప్పుపడి వచ్చానే. ఆమె దగ్గర గౌరవంగా మసలుకోక పొయ్యానే" - అని అనుకుని బాధపడుతూ నిలబడ్డాడు. ఆమె తనను ఎంత మాత్రమూ హీనంగా చూడలేదు. అయినా ఆమె ముందు తనను వామన రూపంలోకి కుంచించుకుపోయినట్లు భావించుకున్నాడు. 'ఛీ నేను దిగజారిన విషయమా కృష్ణ అయ్యర్‌కు చెప్పేది ?' అనుకుని గబ గబా డాబా దిగి వెళ్ళిపొయ్యాడు రామనాథన్. అయితే కృష్ణ అయ్యర్ సిద్ధాంతం తప్పని చెప్పాలి కదా? చెప్పాలి చెప్పాలి తప్పక చెప్పాలి అతను చాలా మంచివాడు. ఎదుటి వారి భావనల్ని గౌరవించే వ్యక్తి. ఫస్ట్ తారీఖున డబ్బులు చేతిలో పడగానే ఏదో ఒకటి చెయ్యాలి - అనుకున్నాడు. శీర్షాసనంలో వున్న కృష్ణ అయ్యర్ రామనాథన్ వచ్చి వెళ్ళింది గమనించనే లేదు.

తన జీవితంలో ఏ ఆడదానికీ మనసివ్వని రామనాథన్‌కు సరళ స్పర్శ మరి మరి కావాలనిపించింది. చేతులు కట్టుకుని నిలబడ్డ విగ్రహంలా అతని మనసు కట్టి వేయబడి ఉంది. ఆ విధంగా ఆమె తలపులతో పది రోజులు గడిపాడు. నెల చివరరోజున జీతం తీసుకునేప్పుడు మరో నెల బోనస్ కలిసి రావడం చూసి సంతోషం ఇనుమడించింది. మూడు వందలు జేబులో పడగానే ఎగిరి వెళ్ళి సరళ ముందు వాలాలని అనిపించింది. ఆమె ఎదురుగా నిలబడి, ఆమె తీయని చూపుల్ని తనివి తీరా అనుభవించాలనుకున్నాడు. ఆమెను ముట్టుకోవడం కూడా అతనికి ఇష్టం లేదు. స్త్రీ లోలుల కుండే వ్యాకరణాన్ని ఛందస్సును అతను కూడా దాటాలనుకున్నాడు. బజారులో నడిచేప్పుడు అతడికొక ఆలోచన వచ్చింది. వెంటనే ఒక బట్టల దుకాణంలోకి వెళ్ళి అరవై రూపాయలకు సరళ కోసం నీలి రంగు జరి అంచు చీర కొనుక్కుని బయటకు వచ్చాడు. అతను చేసిన పనికి అతనే నవ్వుకున్నాడు. ఒక అమ్మాయికి చీర కొనాల్సిన అవసరం ఏర్పడుతుందని అతడు కలలో కూడా అనుకోలేదు. నవ్వొస్తే దాచుకోవడం రామనాథన్‌కు చేత కాదు. కాబట్టే ఆ రోజు బస్సు స్టాండులో సరళతో పరిచయమైంది. ఆ మధురమైన క్షణాల్ని తలుచుకుంటూ చిరునవ్వుతో వేగంగా నడుస్తున్నాడు ..

.. చీర చూసి ఆమె ఎంత సంతోషిస్తుందో ? వెటకారంగా ఏమైనా అన్నా అంటుంది. "ఈ చీర ఇప్పుడే కట్టుకో చూద్దాం" అని అంటాడు. తను. "ఒక్క నిముషం" అని ఆమె గదిలోకి వెళ్తుంది. అప్పుడతను కుర్రాణ్ణి పిలిచి కాకా హోటల్లోంచి మలాయ్ చాయ్ తెప్పిస్తాడు. ఆ తర్వాత ఇద్దరూ బయటికి వెళ్ళి భోజనం చేస్తారు. కొత్త కొత్త వంటలు తెప్పించి రుచి చూపించాలి. బయటికి ఎందుకూ ఇంట్లోనే వంట చేస్తానని అంటుంది కాబోలు ! అయినా ఆ రోజు ఎంత చక్కటి వంట చేసి పెట్టింది? ఎంత త్వరగా చేసిందో, ఎంత ప్రేమతో వడ్డించిందో, ఆడదంటే ఆడదే ! మంచిదయినా, చెడ్డదయినా మోసకత్తెయినా, వేశ్య అయినా ఆమె దగ్గర అమ్మాయి తనం ఉండాలి. అమ్మతనం ఉండాలి. సరళ దగ్గర ఇవన్నీ మస్తుగానే ఉన్నాయి. ఈ రోజు ఆమెను వంట చేయనివ్వగూడదు. 'నువ్వ ఈ రోజు నా అతిథివి" అని చెప్పాలి. తర్వాత సినిమా. ఇంటి కొచ్చాక రాత్రంతా ఆమెతో మాట్లాడుతూ గడపాలి. ఆమె చదువుకున్నదే. జీవితంలో బాగా దెబ్బతిన్నదే. అందుకే కొన్ని సందర్భాల్లో ఎంతో వివేకంగా మాట్లాడుతుంది. ఒక ఆడ మగ శారీరక సంబంధమైన భావనల్ని పక్కకు నెట్టి మేధో సంబంధమైన చర్చలో పాల్గొనడం ఎంత ఉన్నతమైంది? ఎంత ఉదాత్తమైనది ?

ఉదయం కాగానే, మనసులో భరించరాని సంతోషపు భావవతో పునీతమైన .. వీడ్కోలు చెప్పుకోవాలి !! ఆమె చిరుకోపంతో మందలిస్తుంది "ఎవరయ్యా నువ్వూ? కొత్త చీర తెచ్చావు. ఊరికే వచ్చి ఇంత డబ్బు ఖర్చు పెట్టి పోతున్నావ్" అని. "నీకో భర్త వుండి వుంటే అతను కొనిచ్చిన చీర సంతోషంగా తీసుకునేదానివా కాదా ?" అని తనంటాడు. అప్పుడు ఆమెకు దుఃఖంతో మాటలు రాకుండా అవుతుంది. ఆమె కఠినంగా వుండడానికి ప్రయత్నించినా .. చివరి దాకా ఉండలేక పోతుంది. అవును, చివరి దాకా -

- ఆమె గురించి కలలుకంటూ ఆమె ఇంటి దాకా నడిచాడు రామనాథన్. తలెత్తి చూస్తే వీధి గుమ్మానికి కప్పంత తాళం వేలాడుతూ కనిపించింది. ఎవరో గుండెను పిసికేసినట్లు అయ్యింది. అక్కడే నిలబడిఅటూఇటూ చూశాడు. టీ తెచ్చి పెట్టే ఖాకీ నిక్కరు కుర్రాడు ఎటో పరిగెత్తుకుంటూ వెళుతూ "సరళక్కను పోలీసులు పట్టుకు పోయారు" అని చెప్పాడు. అదేదో మామూలు విషయమైనట్టు. రామనాథన్ ప్రాణం నిలువుకా కుప్పకూలిపోయింది. ఇంతటి విషాదమైన సంఘటన అతని జీవితంలో మరేదీ జరగలేదు. గుండెల్లోంచి దుఃఖం పొంగుకొస్తూ ఉండగా కన్నీటిని అతి కష్టంగా ఆపుకున్నాడు. ఆమె జ్ఞాపకార్థం 'శ్రద్ధాంజలి' ఘటిస్తున్నట్లు ఆమె ఇంటి ముందు అలాగే రెండు నిముషాలు తల వంచుకుని నిలబడ్డాడు.

"బాబూ ! ఒరేయ్ !! ఆయన గారిని ఇక్కడికి తీసుకురా" అనే మాటలు వినిపించాయ్. రామనాథన్ వెనక్కి తిరిగి చూశాడు. "రండి' ' అని నవ్వుతూ బాగా పరిచయమున్న దానిలాగా ఆహ్వానించింది, ఎదురింటి స్త్రీ. "మీరు తప్పక రావాలి. నేనే కావాలని రావొద్దు. నేను దొరకని సందర్భంలో .." అంటూ సరళ చెప్పిన మాటలు గుర్తుకొచ్చి, ఎదురింట్లోకి వెళ్ళాడు.

మౌనంగా కూర్చున్న రామనాథన్‌ను చూసి ఎదురింటి ఆమె విషయం వివరంగా చెప్పింది. "సరళను మొన్న పోలీసులు పట్టుకెళ్ళారండి. తప్పు ఆమెది కూడా ఉంది. మరీ విచ్చలవిడిగా ప్రవర్తించ సాగింది. గౌరవమైన వాళ్ళు ఇటువైపు రావడం మానేస్తున్నారు. కనీసం పోలీసులంటేనైనా భయం ఉందా ? అదీ లేదు.

మేమంతా పోలీసులంటే హడలి ఛస్తాం ! వాళ్ళకు చెల్లించుకోవాల్సింది ఏదో చెల్లించుకుని భయంతో ఉంటాం. ఈమెకు అదేమీ లేదు. తానొక రాణీ అయినట్టు ఎవరినీ లెక్క చేయకుండా

తిరగ సాగింది. అందువల్ల ఈమెను ఎలాగైనా పట్టుకోవాలని ఒక పథకం ప్రకారం కాపలాకాచి పట్టుకున్నారు. అప్పుడు కూడా ఎంత గలాటా చేసిందనీ ? ఇంగ్లీషులో వాళ్ళని చెడామడా తిట్టింది. దాంతో నాలుగుబాది బలవంతంగా లాక్కెళ్ళారు. ఆమెను అరెస్టు చేసినందుకు ఈ వీధంతా నవ్వింది.

"చాలు !"అని ఆపాడు. ఏం మాట్లాడకుండా చేతిలో వున్న చీర ప్యాకెట్‌ను ఆమెకు ఇచ్చాడు. "సరళ వుంటే కూడా ఈ చీరతో పాటు నన్ను నీ దగ్గరికే పంపేది. సరే - ఇది తీసుకో !" అయోమయంగా రామనాథన్ మొహం చూస్తూ ఆ స్త్రీ చీర తీసుకుంది. ఆరోజు ఎదురింటి దాని నలగని పూలు చూయించి సరళ చెప్పిన మాటలు రామనాథన్ మనసులో గింగురు మన్నాయి. "సరళ నీ మీద ఎంత ప్రేమగా ఉండేధో నీకు తెలియదు" అని చెబుతూ ఆమె ముఖం కూడా చూడకుండా బయటికి నడిచాడు. చేతిలోని చీరతో ఆమె అతడు వెళుతున్న వైపే చూసింది. ఎదురుగా మూసి వున్న సరళ ఇంటి తలుపులు చూసింది. రామనాథన్ మాటలతో, ప్రవర్తనతో ఆమెకు సరళ మీద వున్న అర్థం లేని అసూయ కరిగి పోయింది. మూసి వున్న సరళ ఇంటి తలుపుల మీద సరళ బొమ్మ కనిపించినట్లు అయ్యింది. అమాయకంగా నవ్వుతూ, ప్రేమగా చూసినట్లు అనిపించింది. ఎన్నో సార్లు, ఎన్నో విధాల సరళ చేసిన సహాయాలు జ్ఞాపకం వచ్చాయి. ఈ చీర కూడా సరళ సహాయమే. కదా? ఆమెను చూసి ఈర్ష్య పడే వాళ్ళలో తను కూడా ఎందుకు చేరింది? ఆమె మనసుతడిసి, ఊటయ్యింది,. సరళను చూసి హేళనగా నవ్విన ఆ వీధి తప్పు తెలుసుకుని ఏడవాల్సిన అవసరముందన్నీ విషయం గ్రహించింది.

రామనాథన్ చెప్పినదంతా విని కృష్ణ అయ్యర్ పులకించి పొయ్యాడు. మానసికంగా శారీరకంగా ఒక ఉత్తేజాన్ని పొందాడు. ఒక వేశ్యను అంత బాగా అర్థం చేసుకున్న కృష్ణ అయ్యర్‌ను చూసి రామనాథన్‌కు ఆశ్చర్యం వేసింది.

భ్రష్టు పట్టి పోయిన సమాజాన్ని గూర్చి ఆలోచనలతో వేదనతో, అసంతృప్తితో బాధపడుతూ ఈజీ ఛైర్‌లో వాలిపొయ్యాడు రామనాథన్. ఐడియల్స్ మాట్లాడుతూనే అందరూ తప్పులు చేస్తున్నారని అతనికి తోచింది. గడ్డం కింద చేతులు పెట్టుకుని ఏవేవో ఆలోచిస్తున్న రామనాథన్ వేళ్ళ మధ్య సిగరెట్ కాలిపోతుంది. తాగకుండా కాలానికి వదిలేసిన సిగరెట్ ఒక వేశ్య లాంటిది. కాలుతూ కాలుతూ దానికదే క్షీణిస్తూ, బూడిదగా మారే సిగరెట్ - అనుభవించాలనుకునే సరికి అందకుండా పోయే వేశ్యలాంటిది. రామనాథన్‌ను ఆ స్థితిలో చూసిన కృష్ణ అయ్యర్ అతడి మనసును. భావనల్ని అర్థం చేసుకున్నాడు. బాధపడ్డాడు. ఓదార్చడం కోసం ఓ మాట చెప్పాడు. "నీకు నీ కవితకు ఛందస్సు లేకపోవచ్చు. నీకు నీ వేశ్యకు వ్యాకరణం లేకపోవచ్చు. నేను అర్థం చేసుకోగలను. కాని రామనాథన్ నువ్వు ఒక విషయం గుర్తుంచుకో ! మనం బతికే ఈ సమాజముందే దానికో వ్యాకరణముంది. దానికో ఛందస్సు ఉంది. దాన్ని అర్థం చేసుకుంటూ మాత్రమే మనం నడుచుకోవాల్సి ఉంటుంది" - అని చెబుతూ అతని భుజం తట్టాడు. పెద్ద మనిషి తరహాలో -

"వ్యాకరణమా ? ఛందస్సా? సిద్ధాంతమా? హూఁ - మై ఫుట్! అసలు ఈ సమాజానికి వ్యాకరణమే తయారు కాలేదు" - ఈ సడింపుగా అని, దుఃఖంతో నవ్వుతూ గుండెను దిటవు చేసుకుంటూ గట్టిగా సిగరెట్ పొగ పీల్చి వదిలాడు. అంతవరకూ కాలిపోయివున్న పొడుగైన సిగరెట్ బూడిద టపీమని కిందపడి, రాలి చెదిరి పోయింది -

భిన్న ధృవాలలో వుండి, విభిన్నమైన దృక్పథాలలో చర్చించు కుంటున్న ఆ స్నేహితులిద్దరూ రాలిపడిన ఆ బూడిదను గమనించలేదు. వాళ్ళకేం ? తెలివిగల వాళ్ళు ! తెలివితో ఏ వ్యవహారాన్నైనా ఆటంకం లేకుండా చివరిదాకా నడిపించగలవాళ్ళు.

వాళ్ళు వ్యాకరణాన్ని తయారు చేస్తారు. దాన్నే దాటి వెళ్తారు. ఛందస్సును రూపొందించుకుంటారు. దాన్నే కొట్టివేస్తారు. దాటి వెళ్ళినప్పుడు కొట్టివేసినపుడు తమ దృక్పథం ఏ విధంగా సరైనదోనని .. తెలివిగా కారణాల్ని వెతికి చూపుతారు.

అయితే కవిత, వీటన్నిటికీ ఎదురు చూడదు ! సాగిపోతుంది.

కొన్ని జీవితాలు కవితల్లాంటివే ! !

('ఇలక్కణం మీరియ కలిదె - తమిళ మూలం నుండి నేరుగా చేసిన అనువాదంలో సహకరించిన తమిళ మిత్రుడు పి.డి. రామచంద్రన్ గారికి కృతజ్ఞతలు)

✤

## "ధాత" కవి సమ్మేళనం

**– కొల్లు రంగారావు**

ధాత ఉగాది సందర్భంగా ఆకాశవాణి కడప కేంద్రం మార్చి 16వ తేదీ కడప కళాక్షేత్రంలో ఆహూతుల సమక్షంలో ఉగాది కవి సమ్మేళనాన్ని నిర్వహించింది.

"శ్రోతలకు - ఆకాశవాణికి మధ్య మరింత సన్నిహిత సంబంధం పెంపొందించడమే స్టేజ్ కార్యక్రమాల ప్రధానోద్దేశమని, వేదికపై కవితాగానం చేసే కవులను ప్రేక్షకులు ఎలా స్వీకరించేది ప్రేక్షకుల చూపులు, కరతాళధ్వనులు ప్రతిబింబిస్తాయని" ఆకాశవాణి కడప కేంద్రం సంచాలకులు వై. గంగిరెడ్డి తన స్వాగతోపన్యాసంలో పేర్కొన్నారు.

ప్రముఖ కవి, కథకులు పులికంటి కృష్ణారెడ్డి ప్రయోక్తగా వ్యవహరించిన ఈ కవి సమ్మేళనంలో ఆచార్య కొలకలూరి ఈనాక్, ఆచార్య సర్వోత్తమరావు, శేషం సుప్రసన్నాచార్యులు, రామా చంద్రమౌళి, డాక్టర్ డి. మురళీకృష్ణ, కొల్లు రంగారావు, భూతపురి బాల సుబ్బరాయుడు, యస్. టి. జ్ఞానానంద కవి, పి. శామ్యూల్, షేక్ హుస్సేన్ "సత్యాగ్ని", శ్రీమతులు బి. పద్మావతమ్మ, కొలకలూరి స్వరూపరాణి ప్రముఖ సినీకవి జాలాది కవితాగానం చేశారు.

ఈ సందర్భంగా జాలాది ప్రసంగిస్తూ సాహిత్యంలోనైనా సినీ సాహిత్యంలోనైనా విలువల పరిరక్షణ బాధ్యత శ్రోతలపై/ ప్రేక్షకులపైనే ఎక్కువగా వుందన్నారు. ●